క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి అభిషేకం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం దేవస్థానం ప్రాంగణంలోని 16 స్తంభాల మండపంలో శ్రీ అయ్యప్ప స్వామిని కొలువుదీర్చి స్వామికి విశేష పూజలు చేసి, పాలు పెరుగు, నెయ్యి, విభూది, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామిని పుష్పాలతో అలంకరించి దీప దూప నైవేద్యాలు సమర్పించారు. అలాగే పట్టణంలో గొబ్బెమ్మ ఉత్సవం జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి సర్వాంగ సుందరంగా అలంకరించి మాడ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

హైస్కూల్ శిలాఫలకం ధ్వంసం

వరదయ్యపాళెం : మండలంలోని గోవర్ధనపురం హైస్కూల్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ శిలాఫలకాన్ని కొందరు ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు మాత్రం ఇది గుర్తు తెలియని వ్యక్తుల పనేనని చెబుతున్నారు. శిలాఫలకాలు ధ్వంసం చేయడం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్ర మంత్రికి సాదర స్వాగతం



రాష్ట్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : తిరుమల, తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీరాములు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి తిరుమలకు రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు.

హ్యూమన్ రైట్స్ వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్వర్లు



శ్రీకాళహస్తి : నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా కామి వెంకటేశ్వర్లును నియమిస్తూ న్యూఢిల్లీకి చెందిన నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ బీజీఎం రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆ నియామక పత్రాన్ని ఆదివారం కామి వెంకటేశ్వర్లుకు పంపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి ముందుడి పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

అమిత్‌షా రాజీనామాకు డిమాండ్



అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత విశ్రాంతి ఉద్యోగుల సంఘం నేతల నిరసన

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించిన అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రేణిగుంటలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్ మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా మంత్రి పదవిలో కొనసాగడానికి అనర్హుడని విమర్శించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, జయరాం, శ్రీనివాసులు, అర్జునయ్య, జయచంద్ర, ఆషా స్వచ్ఛంద సంస్థ నేత జూలియన్ రాజు, సెల్వరాజ్, హరినాథ్, సి.హెచ్.ఐజయ్య, తులసిరాజన్, వెంకటరమణ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని డిగ్రీ కళాశాల సమీపంలో వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్విచక్ర వాహనంలో వెలుతున్న బైక్ ఢీ కొనడంతో ఇద్దరూ రోడ్డు మీద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే వారిద్దరికీ తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో ఉండడంతో ప్రథమ చికిత్స నిర్వహించి, వారిని రుయాకు తరలించారు. వారి వద్ద ఎలాంటి ఐడీ ప్రూఫ్‌లు లేకపోవడంతో గాయపడిన వారి వివరాలు తెలియరాలేదు.

వరదయ్యపాళెంలో కుంటను తలపిస్తున్న విజ్ఞాన్‌నగర్ వీధి



సంతవేలూరులో బురదమయంగా రోడ్డు



పల్లెకు పండుగ దూరం

సంక్రాంతి నాటికి గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపడుతామని గొప్పలు చెప్పిన కూటమి నేతల మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. మరో మూడు వారాల్లో సంక్రాంతి పండుగ రానేవచ్చేస్తుంది. అయితే 'పల్లెపండుగ' పనులు మాత్రం మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు సత్యవేడు నియోజకవర్గంలో 275 పనులు ప్రభుత్వం మంజూరు చేయగా అందులో కేవలం 78 పనులు మాత్రమే పూర్తయినట్లు అధికారులే చెబుతున్నారు. 53 పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం నత్తనడకన జరుగుతున్న పనుల తీరుకు ఈ గణాంకాలే ప్రత్యక్ష సాక్ష్యాలు.

- సంక్రాంతికి సీసీ రోడ్లు కలేనా?
- మందకొడిగా నిర్మాణాలు
- ముందుకు సాగని పనులు
- వేధిస్తున్న ఇసుక కొరత

మండలాల వారీగా మంజూరైన 'పల్లె పండుగ' నిధులు, పనుల వివరాలు

మండలం	పనుల సంఖ్య	నిధులు (రూ.కోట్లలో)
బీఎన్‌కండ్రిగ	44	2.00
కేవీబీపురం	37	1.99
నాగలాపురం	41	1.42
నారాయణవనం	23	6.11
పిచ్చాటూరు	34	1.43
సత్యవేడు	64	1.93
వరదయ్యపాళెం	32	1.70

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం 'పల్లె పండుగ' పేరిట హడావుడి చేసింది. ఆ రోజున భూమి పూజలతో ఆన్‌లైన్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేసి పనులు ప్రారంభించినట్లు ఫొటోలకు పోజులిచ్చారే తప్ప క్షేత్రస్థాయిలో అమలుకు ఆమడ దూరంలో నిలిచిపోయాయి. సంక్రాంతికి నూతన సీసీ రోడ్లతో గ్రామాల్లో నూతన సదస్సులు చేపడుతామని ప్రగల్భాలు పలికిన నేతలు ఆ దిశగా అడుగులు పడలేదు. పైగా ప్రభుత్వ పనులకు ఇసుక కొరత వేధించడంతో సత్యవేడు నియోజకవర్గంలో 'పల్లెపండుగ' పనులు పల్లెలకు దూరంగా నిలిచిపోయాయి.

ఇసుక ఇక్కట్లు

నియోజకవర్గ పరిధిలో ఉన్న నాగలాపురం ఇసుక రీచ్ నేటికీ ప్రారంభం కాలేదు. అయితే ప్రత్యామ్నాయంగా నియోజకవర్గ సమీపంలోని శ్రీకాళహస్తి-నాయుడుపేట రీచ్‌లు ఉన్నప్పటికీ ఇసుక కొరత బూచిని కూటమి నేతలు వాడుకుంటున్నారు. ఆ దిశగా వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాలకు సంబంధించి రూ.16.59 కోట్లతో 275 పనులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఐజీఎస్) ద్వారా నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో 7 మండలాల్లో 38.77 కి.మీల మేర సిమెంట్ రోడ్ల నిర్మాణం జరగాల్సి ఉంది. అయితే ఈ పనుల్లో నేటి వరకు ఒకభాగం కూడా పూర్తికాకపోవడం గమనార్హం.

పనులు వేగవంతం చేస్తాం

'పల్లె పండుగ' ద్వారా గ్రామాల్లో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సిమెంటు రోడ్ల పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. 7 మండలాల్లో పనులు జరుగుతున్నాయి. వర్షాల కారణంగా రెండు వారాల పాటు పనులకు ఆటంకం కలిగింది. ప్రస్తుతం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పనులు వేగవంతం చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పనులు పూర్తయ్యే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తాం. – గోపి, డీఈఈ, పంచాయతీరాజ్, సత్యవేడు

గ్రామీణ ప్రాంత దారుణాలు

గ్రామీణ ప్రాంతాల్లోని పంచాయతీ రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు దారుణంగా మారాయి. ప్రధానంగా కుంటలను తలపించే విధంగా వీధులు ఉండడంతో అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితిలో గ్రామీణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీలకు సరిపడా నిధులు లేకపోవడంతో పంచాయతీల ద్వారా రోడ్ల అభివృద్ధి సాధ్యంకాలేదు. కూటమి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ఎంపిక చేసుకుని పనులు చేపట్టేందుకు సిద్ధమైంది. ఆ పనుల నిర్మాణాలు సకాలంలో జరగకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.



గుంతలమయంగా కోవూరుపాడు ప్రధాన రహదారి



పల్లె పండుగ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)



వడ్డిపాళెంలో రోడ్డు దుస్థితి ఇలా..

వైభవంగా గంధోత్సవం

శ్రీకాళహస్తి : పట్టణంలో పాత బస్టాండు వద్ద వెలసిన మహబూబ్ సుబహాని ఖాదర్ వలీ జెండా మాను వద్ద ఆదివారం వైభవంగా గంధోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గరికపాటి రమేష్ బాబు హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యులు చోటా బాయ్, నజీర్ బాయ్ సుబ్రహ్మణ్యం, బాబు మేస్త్రి, బాష, జయరామయ్య, శీను, సుబ్రహ్మణ్యం, జిలానీ బాష పాల్గొన్నారు.

ఎర్రచందనం రైతులకు నిబంధనలు సడలించాలి



మాట్లాడుతున్న కొండేటి ఆంజనేయులు

రేణిగుంట : ఎర్రచందనం సాగు చేస్తున్న రైతులు కటింగ్ తర్వాత విక్రయించుకొనేందుకు అటవీశాఖ నిబంధనలను సడలించి సులభతరం చేయాలని రెడ్ శాండర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కొండేటి ఆంజనేయులు కోరారు. మండలంలోని తూకివాకం పంచాయతీ పరిధిలోని సంఘం కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రైతులు సొంత పొలాల్లో ఎర్రచందనం సాగు చేసుకోవడానికి, కటింగ్ తర్వాత విక్రయించుకొనేందుకు అటవీశాఖ నిబంధనలు సవరించాలన్నారు. చాలా మంది రైతులు ఎర్ర చందనం వృక్షాలు పెంచి, అనుమతి రాకుండా చెట్లకు కటింగ్ చేయలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. అటవీశాఖ నిబంధనలను సవరించాలని కోరుతూ ఈ నెల 27న అమరావతిలో సీఎం , డిప్యూటీ సీఎంలను కలసి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ఎస్. రవికుమార్ రాజు, సెక్రటరీ నాగయ్య, జాయింట్ సెక్రటరీ కొండేటి ఆంజనేయులు, మల్లికార్జున రెడ్డి, సాయి, బాబు నాయుడు పాల్గొన్నారు.

ల్యాబ్‌ల అభివృద్ధికి ప్రాధాన్యం



డీఎంహెచ్‌ఓను సన్మానిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

నారాయణవనం : డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్‌ను ఆదివారం తిరుపతిలో ఆయన కార్యాలయంలో ప్రభుత్వ ఆస్పత్రుల ల్యాబ్ టెక్నీషియన్‌లు కలిశారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ల జిల్లా సంఘం నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ బాబు, తులసీరాం మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో ఫ్రంట్ లైన్ వారియర్లుగా పనిచేస్తున్న టెక్నీషియన్‌ల సంక్షేమానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా ల్యాబ్‌ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.



ఆత్మీయ పలకరింపు

తిరుపతి జిల్లాకు కొత్తగా నియమితులైన డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలకృష్ణనాయక్‌ను వైద్యఆరోగ్య సిబ్బంది ఆదివారం తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వైద్యఆరోగ్యశాఖలోని సమస్యలపై చర్చించారు. – తిరుపతి అర్బన్

క్రిస్మస్ ముందస్తు వేడుకలు



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

శ్రీకాళహస్తి : క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో భాగంగా నిత్య జీవారాధన మందిరం తరఫున పాస్టర్లు ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బైబిల్‌లోని సూక్తులను వల్లె వేస్తూ పట్టణంలో ర్యాలీ చేశారు. విద్యార్థులు శాంతాక్లాజ్ వేష ధారణతో ఆకట్టుకున్నారు. బైబిల్‌లోని సూక్తులతో కూడిన కరపత్రాలను పంచిపెట్టారు. ప్రపంచ శాంతి సౌభాగ్యమే ఏసు లక్ష్యమని, ప్రతి మానవుడు ఆనందంగా జీవించాలని ఆయన బోధించారని వివరించారు.

రోడ్లు ఛిద్రం.. బతుకు భద్రం



వర్షానికి కోతకు గురైన సంతవేలూరు రహదారి

వరదయ్యపాళెం : వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు ఆర్‌అండ్‌బీ రోడ్లు, పంచాయతీరాజ్ రోడ్లు పలుచోట్ల ధ్వంసమయ్యాయి. మరికొన్నిచోట్ల రోడ్లు కోతకు గురవ్వడంతో ఆ మార్గంలో రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి ఆర్‌అండ్‌బీకి చెందిన సంతవేలూరు-వరదయ్యపాళెం, పెద్ద పాండూరు-వరదయ్యపాళెం, బత్తలవల్లం-కారిపాకం, చెరివి-చిలమత్తూరు రోడ్లతో పాటు పంచాయతీరాజ్ శాఖకు చెందిన పాండూరు-సిద్ధాపురం, అరుదూరు-వరదయ్యపాళెం రోడ్లు పలుచోట్ల దెబ్బతిన్నాయి. తక్షణమే మరమ్మతులు చేపడితేగానీ వాహనదారుల ప్రయాణ కష్టాలు తీరే మార్గం కనిపించడంలేదు. అయితే ఈ రెండు శాఖలు ప్రభుత్వం నుంచి నిధుల విడుదల కోసం వేచి చూస్తున్నారు.

నర్సరీలతో నారు కష్టాలు తీరే

- రైతన్నకు తగ్గిన ప్రయాస
- విస్తరిస్తున్న నర్సరీలు
- అదునులో పంటల సాగు



నర్సరీలో పెరుగుతున్న వివిధ రకాల నారు



బుచ్చినాయుడుకండ్రిగ : పంటల సాగులో మార్పులొస్తున్నాయి. అందుబాటులో సాంకేతికత.. యాంత్రిక నైపుణ్యం కారణంగా వ్యవసాయంలో పెను మార్పులొచ్చాయి. మోడు వ్యవసాయం కాస్త స్మార్ట్ వ్యవసాయంగా మారుతోంది. ఇంటి వద్ద నుంచే విద్యుత్ మోటారు ఆన్, ఆఫ్ చేయొచ్చు. ఇంటి నుంచే వ్యవసాయ పనులను పర్యవేక్షించొచ్చు ఈ కోవలోనే నారుపోయి వాటి స్థానంలో నర్సరీలు పుట్టుకొచ్చాయి. అవసరం మేరకు పంట నారును సరఫరా చేసే నర్సరీలతో రైతులకు బహుముఖ ప్రయోజనాలు దక్కుతున్నాయి. బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో రైతులు వంకాయ, మిరప పంటల సాగు విస్తృతంగా చేస్తారు. ఒకప్పుడు మిరప, వంకాయతో పాటు పంటల సాగు కావాలంటే రైతులు ఎంతో శ్రమించాల్సి వచ్చేది. మిరప, వంకాయ సాగు కోసం పొలాల్లోనే నారుకు విత్తనం చల్లి మొక్కలయ్యాక పొలంలో నాటుకునేవారు. ఈ ఏర్పాట్లు జరిగేందుకు నేల రోజులు పట్టేది. కొంత మందికి నీటి కొరత, మరి కొంత మందికి విద్యుత్ సమస్య ఉండేది. నారు పెంచేందుకు ఎంతో వ్యయ ప్రయాసాల కోర్చాల్సి వచ్చేది. అయితే రైతుల్లో కూరగాయలు, వాణిజ్య పంటల సాగుపై మక్కువ పెరగటం, మంచి ధరలు మార్కెట్లో లభిస్తుండటంతో పంట సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతూ వస్తోంది. పంట కోత సమయం తగ్గాలనే ఉద్దేశంతో నర్సరీలను ఆశ్రయిస్తుండటంతో మండల కేంద్రంలో నర్సరీలు అనేకం పుట్టుకొస్తూనే ఉన్నాయి.

సమయం కలిసొస్తుంది



వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటాయో అంచనా వేయటం కష్టమవుతోంది. అందువల్ల ముందస్తుగా పొలంలో నారు పోసుకుంటే అవి మొక్కలయ్యే సరికి వర్షాలు వస్తాయో, రావో తెలియదు. వర్షాలు ఆలస్యమైతే నారు ముదిరిపోతుంది. అందువల్ల నర్సరీల్లో అయితే మనకు ఎప్పుడు అవసరమో అప్పుడే నారు కొనుగోలు చేసి పంటసాగు చేయొచ్చు. దీనివల్ల పెట్టుబడి వ్యయం పెరిగినా సమయం కలిసొస్తుంది. అదునులో పంట సాగు చేయవచ్చు. – కృష్ణారెడ్డి, మిర్చి రైతు, బుచ్చినాయుడుకండ్రిగ

మార్కెట్ ధరలకు అనుగుణంగా



నర్సరీలో మొక్కల విక్రయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. మిర్చి, వంగ, టమాట, ధరలు మార్కెట్లో బాగుంటే రైతులు ఎక్కువ ధరకైనా నారు కొంటారు. అదే మార్కెట్లో ధరలు పడిపోతే పంట సాగు చేసే వారి సంఖ్య తగ్గిపోయి మేము కూడా నష్టపోవాల్సి వస్తుంది. మిరప, వంకాయ, టమాట నారు అందుబాటులో ఉంచుతున్నాం. వాతావరణం, మార్కెట్ ధరలపై నర్సరీల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. – రమణ, నర్సరీ యజమాని

'పుర' దక్షిణ ద్వారం తెరుచుకుంది!



పురపాలక కార్యాలయం వద్ద తెరుచుకున్న దక్షిణ ద్వారం

శ్రీకాళహస్తి : పురపాలక సంఘం దక్షిణ ద్వారం 8 ఏళ్ల తర్వాత అధికారులు తెరిచారు. గతంలో రాధారెడ్డి పురపాలక చైర్మన్‌గా ఉన్నప్పుడు ఆయన ఎదుర్కొన్న సమస్యల కారణంగా ఆనాడు దక్షిణ ద్వారాన్ని మూసివేయించి, తూర్పు వైపున ద్వారాన్ని ఏర్పాటు చేయించారు. ఆ తర్వాత చైర్మన్‌లు ఉన్న కాలంలో ఆ ద్వారం జోలికి ఎవరూ పోలేదు. పది రోజుల కిందట పురపాలక సంఘం అధికారులు మళ్లీ దక్షిణ ద్వారాన్ని తెరిచి వినియోగంలోకి తీసుకొచ్చారు. ప్రస్తుతానికి పురపాలక సంఘంలో చైర్మన్ లేరు. అధికారుల నిర్ణయంతోనే ఆ ద్వారం తెరిచినట్లుగా తెలుస్తోంది. వాస్తును నమ్మి ఆ నాడు ద్వారం మూసిన అప్పటి చైర్మన్ రాధారెడ్డి , ఆ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఇప్పుడు లేరు. దీంతో దక్షిణ ద్వారం తెరవడంతో వాస్తు దోషాలు ఎలాంటి ప్రభావం చూపుతాయోనని కొంత మంది నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరి కొంత మంది మూఢ విశ్వాసాలుగా కొట్టిపారేస్తున్నారు.

అలంకార ప్రాయంగా ఫౌంటెన్

శ్రీకాళహస్తి : శివం సర్కిల్ వద్ద వాటర్ ఫౌంటెన్ మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. పట్టణంలోని శివం సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అర్ధనారీశ్వరుని ప్రతిమ చుట్టూ వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. గతంలో మహాశివరాత్రి సమయంలో మరమ్మతులు చేయగా రెండు నెలల పాటు పనిచేసింది. అనంతరం దాన్ని పట్టించుకోకపోవడం మట్టి పేరుకుపోయి వర్షం నీటితో నిండి దుర్గంధం భరితంగా మారింది. వెంటనే ఆలయ అధికారులు మరమ్మతులు చేశారు. కార్తీకమాసంలో విద్యుత్ దీపాలతో వాటర్ ఫౌంటెన్ సిద్ధం చేశారు. పది రోజులు తిరగకుండానే ఫౌంటెన్ పనిచేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



శివం సర్కిల్ వద్ద పనిచేయని వాటర్ ఫౌంటెన్